క్లుప్తంగా

నేటి నుంచి పోషకాహార వారోత్సవాలు

గురజాల : ఈ నెల 9వ తేదీ నుంచి 23వ తేదీ వరకు పోషకాహార వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని గురజాల ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ వై.రత్నకుమారి తెలిపారు. 9వ తేదీ శనివారం నుంచి 23 వరకు అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఎలా తయారుచేసుకోవాలి పిల్లలకు ఎటువంటి బలవర్ధకమైన ఆహారం ఇవ్వాలి అనే విషయాలపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు.

మండాదిలో ఉచిత కంటి వైద్య శిబిరం



వెల్దుర్తి: మండలంలోని మండాది గ్రామంలో డాక్టర్ రామలింగారెడ్డి మ్యాక్సి విజన్ కంటి వైద్యశాల ఆధ్వర్యంలో మండాది మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉచిత కంటి వైద్య శిబిరం శుక్రవారం నిర్వహించారు. ఈ శిబిరంలో అసిస్టెంట్ వైద్యులు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 55 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ శీలం సైదారెడ్డి మాట్లాడుతూ శరీరభాగాల్లో అన్నిటి కన్నా కన్ను ప్రధానమైనదన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించటం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో మురళి, రాజు, కృష్ణ తదితరులున్నారు.

'దీని ఇజితేమ'ను జయప్రదం చేయండి

క్రోసూరు: గుంటూరులోని పొన్నూరు రోడ్డులో గల ఆంధ్ర ముస్లిం కళాశాల ఎదురుగా ఉన్న మర్కస్ మసీదులో ఈ నెల 10వ తేదీ సాయంత్రం జరిగే దీని ఇజితేమ కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా మండల నూర్ బాషా సంఘం కార్యదర్శి షేక్ మస్తాన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహమ్మద్ ప్రవక్త చెప్పిన బోధనలు, ఇస్లాంలోని బోధనా సారాంశాలు తెలియజేసేందుకు హైదరాబాద్ నుంచి పలువురు మత గురువులు హాజరవుతున్నట్లు తెలిపారు. ఇజితేమ కార్యక్రమం తెలుగులో చెప్పబడుతుందన్నారు. మహిళలకు ప్రత్యేక స్థలం కేటాయించబడుతుందన్నారు. కావున ముస్లిం సోదరులందరూ ఈ సభలో ఆశేషంగా పాల్గొని జయప్రదం చేయవలసిందిగా కోరారు.

నేడు మండలంలో మంత్రి అంబటి పర్యటన

ముప్పాళ్ళ: మండలంలోని పలు గ్రామాల్లో ఈ నెల 9న రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పర్యటన జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నక్కా శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. బుల్లెట్ వాహనంపై ఉదయం 6.30 గంటలకు మంత్రి నివాసం వద్ద నుంచి బయలు దేరి ఇరుకుపాలెం, మాదల, రుద్రవరం, తొండపి, దమ్మాలపాడు, బొల్లవరం గ్రామాల్లో పర్యటించి స్థానిక నేతలతో సమావేశమవుతారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, క్రియాశీలక కార్యకర్తలు, అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

కోటప్పకొండ, అమరావతికి ప్రత్యేక బస్సులు

సత్తెనపల్లి: మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని భక్తుల సౌకర్యార్థం సత్తెనపల్లి ఆర్టీసీ డిపో నుంచి కోటప్పకొండ, అమరావతి పుణ్యక్షేత్రాల సందర్శనకు 28 ప్రత్యేక బస్సులు ఆర్టీసీ నడిపింది. పట్టణంలోని ఆర్టీసీ డిపో నుంచి శుక్రవారం ఉదయం 4 గంటల నుంచి అమరావతికి-10, కోటప్పకొండకు-18 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. దీంతో భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పుణ్యక్షేత్రాలను సందర్శించారు.

రేపు విద్యార్థులతో ఐఆర్ఎస్ అధికారి ముఖాముఖి

నరసరావుపేట ఈస్ట్: సివిల్స్ వంటి పోటీ పరీక్షల్లో విజయం సాధించేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలపై విద్యార్థులకు ఐఆర్ఎస్ అధికారి ఈదర రవికిరణ్‌తో ముఖాముఖి కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు శ్రీనాథ సాహితీ పరిషత్ కార్యదర్శి స్వర్ణ చినరామిరెడ్డి శుక్రవారం తెలిపారు. పల్నాడురోడ్డులోని శాఖా గ్రంథాలయంలో ఆదివారం ముఖాముఖి ఏర్పాటు చేసినట్లు వివరించారు.

కాకతీయ కమ్మ సత్రానికి విరాళం

శావల్యాపురం: మండలంలోని పోట్లూరు గ్రామంలో కాకతీయ కమ్మ సేవా సమితి సారథ్యంలో కోటప్పకొండ తిరునాళ్లలో కాకతీయ కమ్మ సత్రానికి రూ.1, 60,516 అందజేసినట్లు కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు. ప్రతి ఏటా గ్రామస్తులు సహకారంతో విరాళాలు అందజేయటం ఆనావాయితీగా వస్తుందన్నారు. అదే విధంగా శావల్యాపురానికి చెందిన వారు రూ.17,700 విరాళం అందజేశారు.



రామప్ప దేవాలయంలో బారులు తీరిన భక్తులు



ఉప్పలపాడులోని బుగ్గమల్లేశ్వర స్వామి దేవాలయంలో అభిషేకాలు



దైదలో బారులు తీరిన భక్తులు

హరహర.. నమఃశివాయ

- ఘనంగా మహాశివరాత్రి వేడుకలు
- పలు దేవాలయాల్లో విశిష్ట పూజలు
- భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు

మాచర్ల: మహాశివరాత్రి సందర్భంగా వివిధ దేవాలయాల్లో ఘనంగా మహాశివరాత్రి కార్యక్రమాలు నిర్వహించారు. అందులో భాగంగా శుక్రవారం తెల్లవారుజాము నుంచి శివాలయాలలో భక్తులు స్వామి వారికి పూజలు చేసేందుకు బారులు తీరారు. పట్టణ శివారులోని జమ్మలమడక రహదారిలో వేంచేసియున్న రామప్ప దేవాలయంలో వందలాది మంది భక్తులు బారులు తీరి స్వామి వారికి అభిషేకాలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

■ పట్టణంలోని పాత మాచర్లలో వేంచేసియున్న గంగాపార్వతి నగరేశ్వరస్వామి ఆలయంలో తెల్లవారుజాము నుంచే అర్చకులు వంశీకృష్ణ, ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో స్వామి వారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో బారులు తీరి స్వామిని దర్శించుకున్నారు.

■ శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయ సమీపంలోని వీరభద్ర స్వామి ఆలయంలో తెల్లవారుజాము నుంచే స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి, అర్చకులు ఆశీర్వదించారు. పట్టణంలోని రింగురోడ్డు సెంటర్ నుంచి సాగర్‌కు వెళ్లే రహదారిలో శివాలయం వద్ద మహాశివరాత్రి ఉత్సవాలలో అన్నదానం నిర్వహించారు. అదే విధంగా బుగ్గమల్లేశ్వర స్వామి దేవాలయం, ఎస్టీ హాస్టల్ సమీపంలో శివాలయంలో యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కామనబోయిన కోటయ్య, నాగరాజుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

మారుమోగిన శివాలయాలు

వెల్దుర్తి: మండలంలోని వివిధ గ్రామాలలో ఉన్న శివాలయాల్లో శివనామస్మరణ మార్మోగింది. గొట్టిపాళ్ళ గ్రామంలో వేంచేసియున్న భక్తమార్కండేయ స్వామి వారి ఆలయంలో అర్చకులు జిగురు శంకరశర్మ, గుండ్లపాడులో ఉన్న ఉమామహేశ్వరాలయంలో వెల్లంకి సుబ్రహ్మణ్యశర్మ, శిరిగిరిపాడు శివాలయంలో యండపల్లి సుబ్బారావు, ఉప్పలపాడు బుగ్గమల్లేశ్వరస్వామి ఆలయంలో మేడిపల్లి నర్సింహమూర్తిలు స్వామి వార్లకు తెల్లవారుజామునే అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. బుగ్గమల్లేశ్వర స్వామి ఆలయంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం జరిగింది. వివిధ గ్రామాల్లో శివాలయాల్లో భక్తులు పెద్ద ఎత్తున బారులు తీరి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గొట్టిపాళ్ళలో కోలాట ప్రదర్శన చూపరులను ఆకట్టుకుంది. మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. స్వామి వార్ల ఉత్సవ విగ్రహాలను గ్రామ వీధుల్లో ఘనంగా ఊరేగించారు.



గంగా పార్వతి నగరేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక అలంకరణలో మూలవిరాట్

శివనామస్మరణతో మార్మోగిన శైవక్షేత్రాలు

గురజాల : మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని హరహర మహాదేవా.. శంభో శంకర అంటూ శివనామస్మరణతో శైవక్షేత్రాలు శుక్రవారం మార్మోగాయి. శివరాత్రి పండుగ పురస్కరించుకుని పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పట్టణంలో వేంచేసియున్న అమరలింగేశ్వర స్వామి దేవాలయం, ముక్కంటేశ్వర స్వామి, వీరభద్రస్వామి, గంగా పార్వతీ సమేత ఇష్టకామేశ్వర స్వామి దేవాలయాలకు భక్తులు పోటెత్తారు. స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదే విధంగా జంగమహేశ్వరపురం గ్రామంలోని కోనేరు వద్ద వేంచేసియున్న శివాలయంలో భక్తులు బారులు తీరారు.



గోగులపాడు గ్రామంలో ప్రత్యేకంగా ఆకర్షిస్తున్న విగ్రహాల ప్రదర్శన

పోటెత్తిన అమరలింగేశ్వరస్వామి దేవాలయం

మండల పరిధిలోని దైద గ్రామంలో కృష్ణానది తీరాన వేంచేసియున్న అమరలింగేశ్వరస్వామి దేవాలయం భక్తులతో పోటెత్తింది. వేకువజాము నుంచి భక్తులు కృష్ణానదిలో స్నానమాచరించి బిలంలో కొలువై ఉన్న అమరలింగేశ్వరుడిని దర్శించుకుని అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదే విధంగా మండల పరిధిలోని గోగులపాడు గ్రామంలో వేంచేసియున్న గంగా పార్వతి నీలకంఠేశ్వరస్వామి వారి దేవాలయంలో స్వామి వారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. గోగులపాడు గ్రామంలోని దేవాలయంకు ఉదయం నుంచి భక్తులు బారులు తీరి స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా సీఐ బాలకృష్ణ ఆదేశాల మేరకు ఎస్ఐలు బి.అనంత కృష్ణ, సౌందర్‌రాజన్‌లు తగు చర్యలు చేపట్టారు. శివరాత్రిని పురస్కరించుకుని దైద, గోగులపాడు గ్రామంలో గ్రామ సర్పంచ్ నంద్యాల రాములమ్మ ఆధ్వర్యంలో పలు చర్యలు చేపట్టారు. దేవాలయాల వద్ద దేవాలయ అభివృద్ధి కమిటీల ఆధ్వర్యంలో భక్తులు జాగారం చేసేందుకు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఎప్పటికప్పుడు ఈవో గణపతి సురేష్ ఏర్పాట్లను పరిశీలించారు.

భక్తులతో కిటకిటలాడిన శైవక్షేత్రాలు



మోర్జంపాడులోని బుగ్గ మల్లేశ్వరస్వామి

పిడుగురాళ్ల: పట్టణంలోని పలు శైవ క్షేత్రాలు భక్తులతో కిటకిటలడాయి. శుక్రవారం శివరాత్రి పురస్కరించుకొని భక్తులు తెల్లవారుజామునే శివాలయాలలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారి భవిష్యత్ బాగుండాలని, అందరు సుఖసంతోషాలతో ఉండాలని పూజలు నిర్వహించారు. ఆలయాలకు హాజరైన భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు, పూజారులు తీర్థప్రసాదాలను అందించారు.

శివనామస్మరణతో హోరెత్తిన శివాలయాలు

మాచవరం: మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని మండలంలోని పలు గ్రామాల్లోని శివాలయాలు శివనామస్మరణతో హోరెత్తాయి. భక్తులు మహాశివుని దర్శించుకొని పూజలు చేశారు. పలు గ్రామాల నుంచి కైలాసవాసుని దర్శించుకునేందుకు భక్తులు కోటప్పకొండ, దైద, సత్రశాల, అమరావతి పుణ్యక్షేత్రాలకు తరలివెళ్లారు. మండలంలోని మోర్జంపాడు శివారులోని బుగ్గ మల్లేశ్వరస్వామి దేవాలయానికి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామి వారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ధర్మకర్తలు, వ్యాపార, స్వచ్ఛంద సేవా సంస్థల నిర్వాహకులు భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలు అందించారు. గ్రామస్తుల సహకారంతో మహాఅన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

భక్తుల కోరికలు తీర్చే తల్లి సాగర్‌మాత



సమష్టి దివ్యబలిపూజలో ప్రసంగిస్తున్న విశ్రాంత పీఠాధిపతులు గోవింద్ జోజి

విజయపురిసౌత్: భక్తులకు దర్శనం ఇస్తూ కోరిన కోర్కెలు తీర్చే తల్లి సాగర్‌మాత అని నల్గొండ విశ్రాంత పీఠాధిపతులు డాక్టర్ గోవింద్ జోజి ఉద్బోధించారు. రెండో రోజైన శుక్రవారం ఆయన సాగరమాత ఆలయంలోని జపమాల క్షేత్రంలో ఆలయ విచారణ గురువులు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ ఆధ్వర్యంలో జరిగిన సమష్టి దివ్యబలిపూజలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. క్రైస్తవ భక్తులంతా సమాజానికి ఆదర్శవంతంగా నిలవాలన్నారు. సాటివారిని ఆదరించడం, ప్రేమను పంచిపెట్టడం క్రైస్తవంలో ప్రధానమన్నారు. సృష్టికర్త సహితం అమ్మ ద్వారానే ఈ లోకానికి వచ్చాడన్నారు. ఈ రోజు అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకోవడం ఎంతో ఆనందకరమైన విషయన్నారు. అమ్మ ప్రేమ, అనురాగాలను ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరితో ప్రేమతో మెలగాలన్నారు.

భక్తిశ్రద్ధలతో వేంకటేశ్వర స్వామి కల్యాణం



మాచర్ల: పట్టణంలోని బస్టాండ్ ప్రాంతంలో వేంచేసియున్న వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శ్రవణా నక్షత్రం పురస్కరించుకొని శుక్రవారం స్వామి వారికి కల్యాణ మహోత్సవం ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు వీరాంజనేయరెడ్డి, కల్యాణ నిర్వహణ కమిటీ సభ్యులు కజ్జం గురవయ్య, పోలిశెట్టి పిచ్చయ్యల ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం భక్తులకు ఆలయ కమిటీ, కల్యాణ కమిటీల ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు అందజేశారు.

మహిళలు అన్ని రంగాల్లో విజయం సాధిస్తున్నారు

మెప్మా సీఎంఎం శ్రీనివాసరావు

పిడుగురాళ్ల: మహిళలు అన్ని రంగాల్లో విజయం సాధిస్తున్నారని మెప్మా సీఎంఎం శ్రీనివాసరావు తెలిపారు. పట్టణంలోని మెప్మా (పేదరిక నిర్మూలనా సంస్థ) కార్యాలయంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మెప్మా సీఎంఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ అమ్మను పూజించడం, భార్యను ప్రేమించడం, సోదరిని దీవించడం అందరం చేస్తాం. అలాగే మహిళలను గౌరవించడం ప్రతి ఒక్కరు చేయాలన్నారు. ప్రస్తుత ప్రపంచంలో మహిళలు అన్ని రంగాల్లో పురుషులకు దీటుగా ముందుకు దూసుకుపోతున్నారని తెలిపారు. మహిళల పట్ల చులకన భావనతో ఉన్న వారు సమాజంలో ఎదిగిన మహిళల చరిత్రలు తెలుసుకుంటే అటువంటివాళ్లల్లో మార్పు వస్తుందన్నారు. నేడు మహిళలు ప్రతి రంగంలో ముందుకు సాగుతున్నారని చెప్పారు. ముందుగా పట్టణంలోని మెప్మా కార్యాలయం నుంచి ఐలాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం నిర్వహించారు. మెప్మా సిబ్బందిలో సీనియర్ మహిళలైన ధనలక్ష్మి, సుజాతలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మెప్మా సీవో బాలాంజనేయలు, మెప్మా ఆర్పీలు తగరం పద్మావతి, కవిత, రాజేశ్వరి, ప్రమీల, కృష్ణవేణి, భారతి, రాణి, అరుణ, తదిలరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

మాచర్ల: పట్టణంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఆయా సంస్థల ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పురపాలక సంఘ కార్యాలయంలో కమిషనర్ డి.వెంకట్‌దాసు ఆధ్వర్యంలో నిర్వహించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన ఏసోబు, మున్సిపల్ మాజీ చైర్మన్‌లు తురక కిషోర్, బోయ రఘురామిరెడ్డి, అబ్దుల్ జలీల్, మున్సిపల్ వైస్ చైర్మన్ పోలూరి నరసింహారావు, కౌన్సిలర్ పోలా శ్రీను, గట్లా అరుణ కోటిరెడ్డి, అనంతరావమ్మ, ఆయా వార్డు మహిళా కౌన్సిలర్లు అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో పాల్గొని మాట్లాడారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మెప్మా ప్రాజెక్టు ఆధ్వర్యంలో జరిగిన మహిళా దినోత్సవంలో ఆయా వార్డు కౌన్సిలర్లు, ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆఫీసర్, పలువురు మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించి వారి అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా బూదాల మరియమ్మ, గట్ల అరుణకుమారిలను ఘనంగా సత్కరించారు. వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, ఆర్పీలను సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో మెప్మా ప్రాజెక్టు అధికారి సుబ్బారావు, ఆర్‌పీలు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలకు ప్రత్యేక చట్టాలున్నాయి..

పట్టణంలోని సాగర్ రోడ్డులో వైభవ్ రెసిడెన్సీలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం మాచర్ల మున్సిఫ్ మెజిస్ట్రేట్ జూనియర్ సివిల్ జడ్జి శారదాదేవి ప్రారంభించారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మహిళా హక్కుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖంగా సేవలు చేసిన మహిళలు అసిస్టెంట్ సర్జన్ రమావత్ విజయలక్ష్మి సేవలను కొనియాడారు. అనంతరం జాగృతి మహిళా మెంబర్ ఆఫ్ రోటరీ క్లబ్ మెంబర్ సురేఖ మహిళల సేవల గురించి మాట్లాడారు. జెడ్పీహెచ్ఎస్ బాలికోన్నత పాఠశాల హెచ్ఎం షేక్ సకీనా, టీచర్ పద్మావతి, షేక్ తస్వీర్, స్టాఫ్ నర్సులు కామేశ్వరి, మల్లేశ్వరితో పాటు పలువురిని ఘనంగా సత్కరించారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కొండా లీలా శివప్రసాద్, డైరెక్టర్ యలమంద వెంకట్రామయ్య, పఠాన్ నాగూర్‌వలి, డాక్టర్ రామకోటయ్య, కొండవీటి కృష్ణకుమారి, కోశాధికారి లక్ష్మి పాల్గొన్నారు.

■ వాసవి క్లబ్ మాచర్ల చెన్నకేశవ ఆధ్వర్యంలో స్థానిక ఆర్యవైశ్య వృద్ధాశ్రమంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఎంపీడీవో సరోజనీదేవి, పలువురు మహిళలను అధ్యక్షులు ఓరుగంటి చెన్నకేశవరావు ఘనంగా సత్కరించారు. పోలూరి నరసింహారావు, జేవీకేఎస్ ప్రసాద్, కొత్తమాసు గిరిజ, పల్నాడు జిల్లా ప్రోగ్రామ్ అధికారి తిరివీధి వెంకట నాగేశ్వరరావు, చిల్లంచర్ల సత్యం, పరిటాల ధనలక్ష్మి, జాయింట్ సెక్రటరీ బచ్చు రాజా, కోశాధికారి చుండూరు సత్యనారాయణ, మేడా వెంకటలక్ష్మి తదితరులున్నారు.

చక్రధర్ డిగ్రీ కళాశాలలో

మహిళలు ప్రత్యేక వ్యక్తిత్వంతో ఎదగాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ తాడి వెంకటేశ్వరరెడ్డిలు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా చక్రధర్ డిగ్రీ కళాశాలలో, లయన్స్ క్లబ్ ఆఫ్ పల్నాడు సభ్యులు పలువురు మహిళలను సన్మానించారు. క్లబ్ గౌరవ సలహాదారు చుండూరు వెంకటేశ్వర్లు, కార్యదర్శి సికిందర్ బాషా, అర్జున్ రావు, మహేశ్వరరెడ్డి, గురవయ్య తదితరులున్నారు.



మెప్మా మహిళలు, సిబ్బంది నిర్వహిస్తున్న మానవహారం



మెప్మా ఆర్పీలను సన్మానిస్తున్న మహిళలు



రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సన్మానిస్తున్న దృశ్యం



మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు



మాట్లాడుతున్న మున్సిపల్ కౌన్సిలర్ గట్ల అరుణ

ప్రతి గడపకు సంక్షేమం అందించింది సీఎం జగనే

మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ జైలాబ్దిన్



పట్టణంని 25వ వార్డులో ప్రభుత్వం అందించిన లబ్ధిని వివరిస్తున్న వైస్ చైర్మన్ షేక్ జైలాబ్దిన్

పిడుగురాళ్ల: ప్రతి గడపకు నవరత్నాల పథకాలను అందించిన ఘనత మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కిందని మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ జైలాబ్దిన్ అన్నారు. పట్టణంలోని 25వ వార్డులో శుక్రవారం గడప గడపకు తిరుగుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇప్పటి వరకు అందించిన పథకాల వివరాలు తెలుపుతూ ప్రజలకు భవిష్యత్‌లో తిరిగి పథకాలు కొనసాగాలంటే తిరిగి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా, గురజాల నియోజకవర్గంలో కాసు మహేష్‌రెడ్డిని ఎమ్మెల్యేగా గెలుపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తెలిపారు. అనంతరం ప్రతి గడపకు వెళ్లి ప్రజలకు అందిన పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వార్డు కన్వీనర్ ఇబ్రహీం, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేసవి నీటి ఎద్దడికి చర్యలు



గార్లపాడు సమీపంలోని మంచినీటి చెరువును పరిశీలిస్తున్న చైర్ పర్సన్ లక్ష్మీతులసి

సత్తెనపల్లి: నాగార్జునసాగర్ కుడి కాలువకు నీటిని విడుదల చేయడంతో పట్టణ ప్రజల దాహార్తిని తీర్చేందుకు మున్సిపల్ యంత్రాంగం మూడు మోటార్లతో గార్లపాడు సమీపంలోని మంచినీటి చెరువును నింపేందుకు యత్నిస్తుంది. మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని కోటప్పకొండ భక్తుల సౌకర్యార్థం నాగార్జునసాగర్ కుడి కాలువకు నీటిని విడుదల చేయడంతో మున్సిపల్ అధికారులు పట్టణంలోని మంచినీటి చెరువును నింపుతున్నారు. మొత్తం మూడు మోటార్లను ఏర్పాటు చేసి రోజుకు 15 మిలియన్ లీటర్లు చొప్పున చెరువు నింపే ప్రయత్నం చేపట్టారు. ఇప్పటికే చెరువులో 400 మిలియన్ లీటర్ల నీరు ఉంది. మంచినీటి చెరువును పూర్తి స్థాయిలో నింపగలిగితే రానున్న వేసవి కాలంలో తాగునీటి ఇబ్బందులు ఉండవు. అయితే కుడి కాలువకు నీరు ఎప్పుడు నిలిపివేస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో శుక్రవారం మున్సిపల్ చైర్ పర్సన్ చలంచర్ల లక్ష్మీతులసి మంచినీటి చెరువుకు నీటిని నింపడాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఆమెతో పాటు చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, తదితరులు ఉన్నారు.

వైభవోపేతంగా మన్నేపల్లి తిరునాళ్ల



బొల్లాపల్లి: మహాశివరాత్రి పండుగను పురస్కరించుకొని మండలంలోని మన్నేపల్లి తండా సమీపంలోని కొండపై వెలసిన మన్నేపల్లి లక్ష్మీనరసింహస్వామి తిరునాళ్ల శుక్రవారం వైభవోపేతంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని పొంగళ్లు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మన్నేపల్లి లక్ష్మీనరసింహస్వామి కళ్యాణం సాయంత్రం అంగరంగవైభవంగా కనుల విందుగా చేశారు. ఉమ్మడి ప్రకాశం, గుంటూరు జిల్లాల నుంచి భక్తులు బారీగ తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. భారీ విద్యుత్ ప్రభలు కొలువుతీరాయి. ఈ సందర్భంగా నిర్వాహకులు ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు, భజన, కోలాటాలు భక్తులను అలరించాయి. భక్తుల రాకపోకల సౌకర్యార్థం వినుకొండ, మాచర్ల ఆర్టీసీ డిపోల నుంచి ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించారు.

నాలుగు పూరిళ్లు దగ్ధం

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని అంబేద్కర్ కాలనీలో నాలుగు పూరిళ్లు దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో కాలనీకి చెందిన పులి వెంకటేశ్వర్లు, పులి వెంకటరమణ, పగిడి నారాయణ, పగిడి నాగరాజులకు చెందిన ఇళ్లు కాలిపోయాయి. గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి సమయంలో నిప్పుపెట్టారని బాధితులు ఆరోపిస్తున్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

యడ్లపాడు: ఆత్మహత్యకు పాల్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... యడ్లపాడు మండలం సొలస గ్రామానికి చెందిన పారిశుద్ధ్య కార్మికుడు కుంభా నాగరాజు తరచు మద్యం తాగుతున్నాడు. మద్యంకు బానిసైతే వివాహం కూడా జరగదంటూ కుటుంబ సభ్యులు అతన్ని గట్టిగా మందలించారు. దీంతో మనస్తాపం చెందిన నాగరాజు గతనెల 26వ తేదీన ఇంట్లో పురుగుల మందు తాగాడు. గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఈనెల 7వ తేదీ రాత్రి నాగరాజు(26) మృతి చెందాడు.